AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
4-12-2025 (Thursday)
MAIN EDITION

## త్వరలో కొత్త టోల్ వ్యవస్థ..: కేంద్ర మంత్రి



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశంలో త్వరలో కొత్త టోల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటికే పది చోట్ల ప్రవేశ పెట్టిన నూతన విధానాన్ని ఏడాదిలో దేశం అంతటా విస్తరిస్తామన్నారు. లోక్‌సభ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో గడ్కరీ మాట్లాడారు. ప్రస్తుత టోల్ వసూలు వ్యవస్థ ఏడాదిలోపే కనుమరుగవుతుందన్నారు. కొత్త విధానంలో ఉపగ్రహాల సాయంతో టోల్ కట్ చేస్తారన్నారు. దీంతో టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. ఆటోమేటిగ్గా టోల్ రుసుము చెల్లించేలా కొత్త వ్యవస్థ ఉంటుందన్నారు.

## 87 లోన్ యాప్స్‌పై నిషేధం




**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 87 అనధికార లోన్ యాప్స్‌పై నిషేధం విధించింది. చట్టవిరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రజలను వేధిస్తున్న యాప్స్‌పై చర్యలు చేపట్టింది. సైబర్ మోసాలు, వేధింపులు, వడ్డీ దోపిడీలపై తరచూ ఫిర్యాదులు వస్తుండడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. డిజిటల్ లోన్ యాప్‌పై కేంద్ర పర్యవేక్షణను మరింత కఠినతరం చేయనున్నట్లు సమాచారం. ఆర్బీఐ, ఐటీ మంత్రిత్వ శాఖ కలిసి లోన్ యాప్స్‌పై సమగ్ర సమీక్ష అనంతరం నిషేధం విధించినట్లు తెలుస్తోంది.

## 500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ



**అక్షరటుడే, అమరావతి:** పల్నాడు జిల్లా అమరావతి మండలంలో రెండో విడత భూ సమీకరణపై రైతులతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. భూ సమీకరణపై రైతుల అభిప్రాయాలను మంత్రితో పాటు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 500 ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ నిర్మించనున్నట్లు తెలిపారు.

## ప్రైవేటు పెట్టుబడులు పెరగాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ముందుకెళ్తోందని కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ నీలేష్ షా అన్నారు. ఈక్విటీలు, ఎఫ్‌డీల విషయంలో ఆశాజనక ధోరణి ఉందన్నారు. స్థూల ఆర్థిక పరిస్థితులు, అనుకూల వడ్డీ రేట్లున్నా.. ప్రైవేటు మూలధన వ్యయాలు బలహీనంగా ఉండడమే ఆందోళనకరమన్నారు.

## విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** విదేశాల్లో ఉద్యోగాల పేరుతో భారత యువతను తరలించి సైబర్ మోసాలు చేయిస్తున్నారని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. తెలుగు రాష్ట్రాల యువతకు థాయ్‌లాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి, ఏజెంట్లు రూ. లక్షలు వసూలు చేస్తున్నారని చెప్పారు.

## రూపాయి పతనం..



**రూపాయి విలువ భారీగా పడిపోతోంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే ఇటీవల భారత కరెన్సీ వేగంగా క్షీణిస్తోంది. రూపాయితో పోలిస్తే డాలర్ విలువ రూ.90 దాటడంతో ఆర్థిక నిపుణులు ఆందోళన చెందుతున్నారు. రూపాయి పతనంతో దేశంలోని పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ముఖ్యంగా దిగుమతి చేసుకునే వస్తువుల రేట్లు పెరగనున్నాయి.** -అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- డాలర్‌తో భారీగా పడిపోయిన విలువ
- జీవితకాల కనిష్టానికి చేరిన వైనం
- ఎఫ్ఐఐల అమ్మకాలతో డాలర్‌కు డిమాండ్

అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. బుధవార రికార్డు స్థాయిలో 90కి పడిపోయిన రూపాయి విలువ గురువారం సైతం మరింత క్షీణించింది. 28 పైసలు పడిపోయి 90.43 వద్ద జీవిత కాల కనిష్టాన్ని తాకింది. మరికొన్ని రోజులు రూపాయి విలువ పడిపోతుందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డాలర్‌తో రూ.92కు చేరొచ్చని అంచనా వేస్తున్నారు. రూపాయి పతనం అవుతున్న కొద్ది దిగుమతి సరుకుల ధరలు భారీగా పెరుగుతుండగా, ఎగుమతి అయ్యే వస్తువులు చౌకగా మారిపోతున్నాయి. ముఖ్యంగా చమురు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి.

**డాలర్‌తో రూపాయి విలువ వివరాలు**

| ఏడాది | ఎక్స్‌చేంజ్ రేట్ |
|---|---|
| 1947 | 3.30 |
| 1990 | 17.01 |
| 2000 | 44.31 |
| 2005 | 43.50 |
| 2010 | 46.02 |
| 2015 | 66.79 |
| 2020 | 74.31 |
| 2025 | 90.43 |

### అనేక కారణాలు

రూపాయి పడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం అందులో ఒకటి. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంలో జాప్యం జరుగుతోంది. ఈ డీల్ ఓకే అయితే ట్రంప్ సుంకాలు తగ్గించే అవకాశం ఉంది. ఒప్పందం కుదరకపోవడంతో రూపాయి పడిపోతుంది. అలాగే దేశీయ స్టాక్‌మార్కెట్ల నుంచి ఫారిన్ ఇన్వెస్టర్లు ఇటీవల వైదొలుగుతున్నారు. చాలా రోజులుగా ఎఫ్ఐఐలు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. దీంతో మార్కెట్‌లో డాలర్‌కు డిమాండ్ పెరిగి బలపడుతోంది. అమ్మకాల ఒత్తిడితో రూపాయి పతనం అవుతోంది. భారత్ 90శాతం ముడిచమురును దిగుమతి చేసుకుంటుంది. ఎలక్ట్రానిక్స్, ఎరువులు, వంటనూనె కోసం విదేశాలపై ఆధారపడుతోంది. రూపాయి పడిపోవడంతో ఆయా వస్తువుల రేట్లు పెరగనున్నాయి.

### విద్యార్థులపై అధిక భారం

రూపాయి పడిపోవడంతో విదేశాల్లో చదువుతున్న విద్యార్థులపై అధిక భారం పడనుంది. దేశంలోని ఎంతో మంది యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో చదువుకుంటారు. గతంలో చాలా మంది విద్యార్థులు విదేశాల్లో చదువుతూ.. పార్ట్‌టైం జాబ్‌లు చేసుకునే వారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ముఖ్యంగా ట్రంప్ వచ్చాక అమెరికాలో కఠిన ఆంక్షలు అమలు అవుతున్నాయి. దీంతో విద్యార్థులు చదువు కోసం ఇక్కడి నుంచే డబ్బులు పంపాలి. రూపాయి పడిపోవడంతో పంపాల్సిన మొత్తం పెరగనుంది.

### వీరికి లాభం

విదేశాల్లో ఉద్యోగాలు చేసే వారు రూపాయి పతనంతో లాభపడతారు. అలాగే వ్యాపారాలు చేసే సంస్థలకు సైతం లాభాలు పెరగనున్నాయి. విదేశాలకు ఔషధాలు ఎగుమతి చేసే భారతీయ ఫార్మాకంపెనీలు కూడా లాభపడనున్నాయి.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పాతబస్తీలోని రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రెయిన్ బజార్‌కు చెందిన మహమ్మద్ జునైద్ (30) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే బుధవారం అర్ధరాత్రి అతడిని దుండగులు కత్తులతో విచక్షణరహితంగా పొడిచారు. దీంతో జునైద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ జునైద్ మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## బీహార్‌లో టీచర్ హత్య..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్‌లో ఓ ఉపాధ్యాయురాలు దారుణ హత్యకు గురైంది. దీంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున టీచర్లు నిరసన చేపడుతున్నారు. బాధిత యువతికి న్యాయం చేయాలని కోరుతున్నారు. బీహార్‌లోని అరారియా జిల్లాలో బుధవారం ఉదయం ఉపాధ్యాయురాలిపై కాల్పులు జరిపారు. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి ప్రాంతానికి చెందిన శివానీ కుమారి (28) ఖబ్డా కన్హైలి మిడిల్ స్కూల్‌లో కాంట్రాక్ట్ టీచర్‌గా చేరింది. ఆమె బుధవారం పాఠశాలకు స్కూటీపై వెళ్తుండగా.. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెపై కాల్పులు జరిపారు. దీంతో శివాని అక్కడే కుప్పకూలిపోయింది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించినా ఆమె అప్పటికే మృతి చెందింది.

## తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్లు హ్యాక్



**అక్షరటుడే, హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన ఈ ముఠా.. తాజాగా పోలీసుల వెబ్‌సైట్‌లను హ్యాక్ చేసింది. హైదరాబాద్ నగరంలోని సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ వెబ్ సైట్లు హ్యాక్ అయ్యాయి. ఏకంగా పోలీస్ కమిషనరేట్ల వెబ్ సైట్లను బెట్టింగ్ మాఫియా హ్యాక్ చేసింది. దీంతో పది రోజులుగా వెబ్ సైట్ల సేవలు నిలిచిపోయాయి. కమిషనరేట్ వెబ్ సైట్లు ఓపెన్ చేస్తే బెట్టింగ్ యాప్ వెబ్ సైట్లకు రీడైరెక్ట్ అయ్యేలా హ్యాకర్లు చేశారు. దీంతో ఐటీ విభాగం రెండు సైట్‌ల సర్వర్లను డౌన్ చేసింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌ల నిర్వహణను నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ చూస్తోంది. ఆ సంస్థ అప్రమత్తమై సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టింది. హ్యాకింగ్‌కు పాల్పడిన ముఠాను పట్టుకోవడానికి సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య మరోసారి ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం మరో 8 మంది చనిపోయారు. బీజాపూర్‌దంతెవాడ సరిహద్దు అడవుల్లో పెద్ద ఎత్తున మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు బుధవారం ఉదయం బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, కోబ్రాకు చెందిన సిబ్బంది ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో బుధవారం ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. 12 మంది మావోలు, ముగ్గురు జవాన్లు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భారీగా బలగాలను ఆ ప్రాంతానికి తరలించారు.

## కొమురవెల్లి మల్లన్న దర్శనాలు నిలిపివేత

**అక్షరటుడే, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కొమురవెల్లిలో కొలువైన మల్లన్న స్వామి దర్శనాలు నిలిపివేశారు. ఈ నెల 14న కొమురవెల్లి మల్లన్న కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీ రాత్రి నుంచి 14వ తేదీ ఉదయం వరకు మల్లికార్జున స్వామి మూల విరాట్ దర్శనాలు నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కల్యాణోత్సవం కోసం పంచ రంగులతో అలంకరణ నేపథ్యంలో దర్శనాలు బంద్ చేసినట్లు తెలిపారు. ఉత్సవ విగ్రహాన్ని దర్శనం చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

## కుప్పకూలిన అమెరికా ఎఫ్–16సి ఫైటర్ జెట్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా ఎయిర్ ఫోర్స్‌కు చెందిన అత్యాధునిక యుద్ధవిమానమైన ఎఫ్-16సి ఫైటర్ జెట్ దక్షిణ కాలిఫోర్నియా ఎడారిలో కుప్పకూలింది. యుద్ధ విన్యాసాల కోసం ప్రసిద్ధిగాంచిన 'థండర్‌బర్డ్స్' స్క్వాడ్రన్‌కు చెందిన ఈ విమానం క్రాష్ అవ్వడం ఆందోళన కలిగించినా.. పైలట్ క్షేమంగా బయటపడడం పెద్ద ఉపశమనంగా భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10.45 గంటలకు, ట్రోనా ఎయిర్‌పోర్ట్ సమీపంలో యుద్ధవిన్యాసాలు చేస్తుండగా విమానం అకస్మాత్తుగా నేలను ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే విమానం మంటలకు ఆహుతైంది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడగా, దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేసింది.

## సౌదీ లాటరీలో భారతీయుడికి రూ.61 కోట్లు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సౌదీ అరేబియాలో మరో భారతీయుడికి జాక్‌పాట్ తగిలింది. కేరళకు చెందిన ఓ వ్యక్తి లాటరీలో ఏకంగా రూ.61 కోట్లు గెలుచుకున్నాడు. కేరళకు చెందిన పీవీ రాజన్ సౌదీలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. 15 ఏళ్లుగా ఆయన లాటరీ టికెట్లు కొనుగోలు చేస్తున్నాడు. అబుదాబి వేదికగా నిర్వహించే 'బిగ్ టికెట్ డ్రా సిరీస్ 281' లాటరీ టికెన్‌ను నవంబర్ 9న కొనుగోలు చేశాడు. డిసెంబర్ 3న లక్కీ డ్రా తీయగా.. పీవీ రాజన్ విజేతగా నిలిచాడు. దీంతో ఆయన రూ.61.37 కోట్లు (25 మిలియన్ల దిర్హామ్‌లు) గెలుచుకున్నాడు. తాను గెలిచిన ఈ డబ్బుల్ని 15 మంది సహచరులతో పంచుకుంటానని రాజన్ చెప్పాడు.

## ల్యాండ్ రికార్డ్స్ ఈడీ ఇంట్లో ఏసీబీ సోదాలు




**అక్షరటుడే, రంగారెడ్డి:** ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. నిత్యం దాడులు చేపడుతూ.. అవినీతి అధికారులను హడలెత్తిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు లంచాలు తీసుకుంటున్న వారిని వల పన్ని పట్టుకుంటున్నారు. అలాగే అక్రమాస్తుల కేసులో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. రంగారెడ్డి ల్యాండ్ రికార్డ్స్ ఈడీ శ్రీనివాస్ నివాసంలో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆయన ఇళ్లతో పాటు కలెక్టరేట్ లో సైతం సోదాలు చేపట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలో తనిఖీలు కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఆరు చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు. ల్యాండ్ రికార్డ్స్ ఈడీగా శ్రీనివాస్ పెద్ద ఎత్తున అక్రమాస్తులు కూడబెట్టినట్లు అధికారులు గుర్తించారు.

## కేసీఆర్ దత్తత గ్రామాల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవం

**అక్షరటుడే, సిద్దిపేట:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు దత్తత గ్రామాలైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి, నర్సన్నపేట పంచాయతీలు మరోసారి అభివృద్ధి-ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయి. రెండు గ్రామాల్లో కూడా సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు కాగా, గ్రామంలో ఐక్యతను కాపాడాలని స్థానిక పెద్దలు, గ్రామస్థులు నిర్ణయించడంతో వివిధ పార్టీల నుంచి నిలబడ్డ అభ్యర్థులు స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలిగారు. దీంతో రెండు గ్రామాల్లోనూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఖరారయ్యాయి.

## విజయ్‌తో పెళ్లి వార్తలపై స్పందించిన రష్మిక..



టాలీవుడ్‌లో కొంతకాలంగా హాట్ టాపిక్‌గా మారింది రష్మిక మందన్నా, విజయ్ దేవరకొండ ప్రేమ, పెళ్లి అంశం. ఈ ఇద్దరి ప్రేమ, సంబంధం, సీక్రెట్ హాలిడేలు, కుటుంబాలతో కలిసి ఉన్న ఫొటోలు.. ఇలా అనేక విషయాలు సోషల్ మీడియాలో ఊహాగానాలను పెంచాయి.
వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి పెళ్లి జరగనుందంటూ వచ్చిన వార్తలు మరింత హాట్ టాపిక్ అయ్యాయి.
ఈ నేపథ్యంలో తొలిసారిగా రష్మిక స్పందించారు. ఆమె తాజా వ్యాఖ్యలు మాత్రం ఈ రూమర్స్‌కు ఫుల్ స్టాప్ కాకుండా.. ఇంకాస్త సస్పెన్స్ క్రియేట్ చేశాయి. ఓ హాలీవుడ్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్మిక మాట్లాడుతూ.. నేను ఈ వార్తలను ఇప్పుడే ధ్రువీకరించలేను. ఖండించాలనే ఉద్దేశం కూడా లేదు. పెళ్లి గురించి మాట్లాడాల్సిన సరైన సమయం వస్తే.. అందరికీ చెబుతాను. ఇప్పుడైతే అంతకుమించి చెప్పలేను అని పేర్కొంది. – అక్షరటుడే, సినిమా డెస్క్